


వాణిశ్రీ

కొలీగ్ పెళ్లికి విజయవాడ వెళ్లాడు కృష్ణ. పెళ్లి పెనమలూరులో ఒక కళ్యాణమండపంలో. లగేజి హోటల్లో పెట్టి బయల్దేరాడు. రాత్రి తొమ్మి దింటికి పెళ్లి. అంతా భోజనానికి డైనింగ్ హాల్లో కి బయల్దేరుతూంటే తనూ లేచాడు.

"ఏయ్ కృష్ణా!"

తనని పిలిచింది ఎవరా అని ఆశ్చర్యంగా చూశాడు. అతను మల్లేశ్వర్రావు. తను విజయ వాడలో టెన్త్‌క్లాస్ చదివినప్పుడు క్లాస్‌మేట్.

"మల్లీ!... నువ్వా?" అంటూ కౌగిలించు కున్నాడు.

ఇద్దరూ చాలాసేపు కబుర్లు చెప్పుకున్నారు. మర్నాడు లంచ్‌కి తమ ఇంటికి రమ్మని కృష్ణని ఆహ్వానించాడు మల్లేశ్వర్రావు. వాళ్లిల్లు తనకు తెలియదంటే, తనే హోటల్‌కి వచ్చి తీసుకెళ్తాన న్నాడు.

అన్నట్లే ఉదయం పదింటికి హోటల్‌కి వ చ్చాడు మల్లేశ్వర్రావు. అతని ఇల్లు కానూరులో ఉంది. రెండొందల గజాల స్థలంలో ఇండిపెం డెంట్ ఇల్లు కట్టుకున్నాడు. ముచ్చటగా వుంది ఇల్లు. అందరినీ పరిచయం చేసాడు.

తండ్రి గోపాలరావు మునిసిపాలిటీలో పని చేసి రిటైరయ్యాడు. తల్లి మాణిక్యమ్మ. భార్య గీత, ఇద్దరు పిల్లలు. మల్లీశ్వర్రావుకి పెళ్లికావ ల్సిన చెల్లెలు శోభ వుంది.

లంచ్ చేసిన తర్వాత "శోభ పెళ్లి చేయాల నుకుంటున్నానోయ్! హైదరాబాద్‌లో ఏదైనా మ్యాచ్ చూడు. నీలాగా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లని భరించే స్తోమత లేదు. చిన్న ఉద్యోగస్థుడైనా, మంచి కుటుంబమైతే చాలు" అన్నాడు మల్లేశ్వ ర్రావు.

"మీ చెల్లెల్ని సరిగా చూడలేదు... ఒకసారి పిలువు మాట్లాడతాను" అన్నాడు కృష్ణ.

"శోభా!" అని పిలిచాడు.

"ఏమిటన్నయ్యా!" అంటూ వచ్చింది శోభ. అప్పుడు పరీక్షగా చూసాడు కృష్ణ.

శోభ చామనఛాయగా వున్నా... ముఖం కళగా వుంది.

ఎత్తుకు తగ్గ లావుతో పొందికగా వుంది.

"నా ఫ్రెండ్ కృష్ణ...!" అని మల్లేశ్వర్రావు చెప్పబోతూండగా "పరిచయం చేసావుగా అన్న య్యా!" అంది శోభ నవ్వుతూ.

"మావాడు నీతో మాట్లాడతాను అంటే పిలి చాను" శోభ ఇబ్బందిగా నిల్చుని నేల చూపులు చూస్తోంది.

"శోభా! ఏం చదువుకున్నావు?" అడిగాడు కృష్ణ.

"బియస్సీ హోమ్‌సైన్సండీ" అన్నది శోభ కళ్లెత్తి అతనివైపు చూస్తూ.

"ఎమ్మెస్సీ చేయడం లేదా?"

"లేదండీ"

"ఏం?"

శోభ ఏం మాట్లాడలేదు.

"పెళ్లిచెయ్యమని అమ్మ గొడవ..." అని మల్లేశ్వర్రావు ఏదో చెప్పబోతూండగా శోభ

సిగ్గుపడి నెమ్మదిగా అక్కడ్నుంచి వెళ్లిపోయింది.

"ఎంత చదివించినా కట్నం ఇచ్చి పెళ్లి చేయాల్సిందేగా! మల్లీ పైచదువులకు డబ్బు ఎక్కడ్నుంచి వస్తుందని అమ్మ గొడవ. అందుకే...!"

"అర్థమైందిలే" అన్నాడు కృష్ణ.

కొంచెంసేపైన తర్వాత కృష్ణ ఇంట్లో అందరి దగ్గరా సెలవు తీసుకుని బయల్దేరాడు.

"నేను చెప్పిన విషయం మర్చిపోకోయ్" అని గుర్తుచేసాడు మల్లేశ్వర్రావు.

కృష్ణ తలవూపాడు.

* * *

రెండు నెలల తరువాత కృష్ణ ఫోన్ చేసాడు.


"మల్లీ! మీ చెల్లాయికి ఒక సంబంధం చూసాను. కుర్రాడి తల్లిదండ్రులు విజయవాడ వస్తున్నారు. మీ చెల్లెల్ని చూపించు. వాళ్లకి నచ్చితే మిగతా విషయాలు మాట్లాడదాం" అని వాళ్లు ఎక్కిన రైలు, సీట్ల వివరాలు చెప్పి స్టేషన్లో రిసీవ్ చేసుకోమని చెప్పాడు.

"మరి అబ్బాయి రావడం లేదా?"

"రావడం లేదు. అతని అమ్మానాన్నలకి నచ్చితే చాలట"

"అదేమిటి? మా చెల్లాయి అతన్ని చూడొద్దా?"

"అతని ఫొటో తెస్తున్నారులే. కావాలంటే మీరు హైదరాబాద్ వచ్చి చూడొచ్చు. అదీగాక అతని ఇల్లూ వాకిలీ అదంతా మీకూ నచ్చాలి



'నేలగంధం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖ కవి శ్రీ పాపినేని శివశంకర్. చిత్రంలో కవి కె. శివారెడ్డి, జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు శ్రీ సోమేపల్లి వెంకటసుబ్బయ్య, పుస్తక రచయిత శ్రీ దర్భశయనం శ్రీనివాసాచార్య

గదా! అదంతా తర్వాత. ముందు ఆ ముసలి వాళ్లకి మీ చెల్లెలు నచ్చనీ" అన్నాడు కృష్ణ.

"సరే!" అన్నాడు మల్లేశ్వర్రావు.

మర్నాడు మల్లేశ్వర్రావు స్టేషన్‌కి వెళ్లి భావ నారాయణని, జానకిని ఇంటికి తీసుకొచ్చాడు. వాళ్లు ఇల్లంతా కలియతిరిగి ఇంట్లో వాళ్లందరి తోనూ చనువుగా మాట్లాడారు. హైదరాబాద్ నుంచి తెచ్చిన పుల్లారెడ్డి స్వీట్లు, యాపిల్స్ ఇచ్చారు. పిల్లలకి ఆడుకునే బొమ్మలు గిఫ్ట్‌ప్యాక్‌లలో ఇచ్చి వాళ్లని ఆశ్చర్యపరిచారు. శోభతో కాసేపు ముచ్చట్లు చెప్పారు.

సాయంకాలం ట్రైన్‌కి టైమైందని బయల్దేరారు.

"అబ్బాయి మీ వెంట రాలేదు..." నసిగాడు మల్లేశ్వర్రావు.

"కుదర్లేదులే..." అన్నాడు భావనారాయణ నవ్వుతూ.

"అది కాదండీ... ఫొటో మీకిచ్చి పంపుతానన్నాడే కృష్ణ...!" అన్నాడు మల్లేశ్వర్రావు.

"అదా!..." అంటూ హేండ్‌బ్యాగ్ నుంచి ఒక కవరు తీసి అతనికి ఇచ్చాడు. మల్లేశ్వర్రావు కవరు తీసి చూడకుండానే వాళ్ల వెంట బయల్దేరి స్టేషన్‌కెళ్లి ట్రైన్ ఎక్కించి వచ్చాడు.

అతను ఇంటికి వచ్చేసరికి అంతా ఎదురు చూస్తున్నారు.

"అదేమిటండీ... పెళ్లికొడుకు ఫొటో పంపమంటే మీ ఫ్రెండ్ తన ఫొటో పంపాడేమిటి?" అన్నది గీత ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ.

"అదేంటి?..." అంటూ ఫొటో అందుకున్నాడు.

అది కృష్ణ ఫొటో.

"ఏదో పొరపాటు జరిగివుంటుంది. భావ నారాయణ కొడుకు ఫొటో బదులు తనది పంపాడు. తారుమారై వుంటాయి ఫొటోలు. నేను కనుక్కుంటాలే" అన్నాడు మల్లేశ్వర్రావు.

వెంటనే కృష్ణకి ఫోన్ చేసాడు.

"కృష్ణా! భావనారాయణగారిని, జానకమ్మ గారినీ ట్రైన్ ఎక్కించి వచ్చాను" అన్నాడు.

"గుడ్" అన్నాడు కృష్ణ.

"అది సరే... వాళ్లబ్బాయి ఫొటో పంపిస్తున్నానన్నావు. నీ ఫొటో ఇచ్చి వెళ్లారే వాళ్లు".

"ఔనోయ్! వాళ్లబ్బాయిని నేనే" అని పకపక నవ్వాడు కృష్ణ.

"వాళ్లు మా కృష్ణ అమ్మానాన్నంటోయ్. కృష్ణే పెళ్లికొడుకు" అని గావుకేక పెట్టి అందర్నీ ఆశ్చర్యపరిచాడు మల్లేశ్వర్రావు.

అందరూ నోళ్లు తెరిచారు.

కృష్ణ ఫొటోవైపే తదేకంగా చూస్తూ సిగ్గు పడుతోంది శోభ.

* * *

శోభనం రోజు రాత్రి పాలగ్లాసుతో గదిలోకి వచ్చి సిగ్గుపడుతూ నిల్చుంది శోభ.

"రా... శోభా! అలా నిలబడిపోయావేం?" అన్నాడు కృష్ణ.

శోభ అతని దగ్గరికి వచ్చి పాలగ్లాసు అందించింది. కృష్ణ ఆమె చేతిని అందుకుని తన పక్కన కూర్చోబెట్టుకున్నాడు. ఆమె తల వంచుకుని నేలచూపులు చూస్తోంది. ఆమె గడ్డం కింద చేయిపెట్టి పైకెత్తాడు. ఆమె కళ్లల్లోకి చూసాడు.

"ఏదైనా మాట్లాడు?" అన్నాడు.

"ఏం మాట్లాడను?"

"ఏదైనా! నీ ఇష్టం"

"నేను మీకెందుకు నచ్చాను?" సూటిగా అతని కళ్లల్లోకి చూస్తూ అడిగింది.

"నిజం చెప్పనా? అబద్ధం చెప్పనా?"

"ముందు అబద్ధం చెప్పండి"

"నీ వంట నాకు బాగా నచ్చిందోయ్!"

"సరే! ఇప్పుడు నిజం చెప్పండి"

"నేను సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ని. కోటి రూపాయలు కట్నం ఇస్తామని సంబంధాలొచ్చాయి. హైదరాబాద్‌లో ఎన్నో మంచి మంచి సంస్థలలో ఉద్యోగాలు చేస్తున్న అందగత్తెలు వున్నారు. వాళ్లందర్నీ వదిలిపెట్టి కట్నం అంటూ ఏమీ తీసుకోకుండా సాదాసీదా సంబంధం ఎందుకు చేసుకున్నానని నీ మనసుని ఎన్నో ప్రశ్నలు తొలుస్తున్నాయి. కదూ?" అన్నాడు కృష్ణ.

శోభ తలవూపింది.

"ఎందుకంటే నువ్వు మధ్యతరగతి చందమామవి" అన్నాడు కృష్ణ.

"చందమామ తెల్లగా వుంటుంది" అన్నది శోభ.

"ఏం? నల్లగా వుండగూడదా?" అని నవ్వాడు కృష్ణ.

"మీరు నిజం చెప్పడం లేదు" గోముగా అన్నది.

"మధ్యతరగతి అమ్మాయి బాధ్యతగా మెలుగుతుంది. హద్దుమీరకుండా ఇతరులు ఏమనుకుంటారో అని సంకోచిస్తూ విలువలు కాపాడుతుంది. జీవితాంతం భర్తతో కాపురం చేయాలనే దృక్పథంతో జీవిస్తుంది. నువ్వు మధ్యతరగతి అమ్మాయివి కావడం వల్లనే నచ్చావు. కుటుంబమంటే మూడు తరాలవాళ్లు నివసిస్తున్నదని

> మనం ప్రేమించే వారి కోసం మన అహంభావాన్ని వీడడం ఎంతో మంచిది. ఎందుకంటే ఆ అహంభావం వల్ల మనం ప్రేమించే వారినే వదులుకోవలసి వస్తుంది కనుక.

అర్థం అంటారు. అది మీ కుటుంబంలో కనిపించింది. మీ వదిన అత్తమామల్ని కన్న తల్లిదండ్రులకంటే మిన్నగా ఆదరించడం నన్ను ఆకట్టుకుంది. అటువంటి కుటుంబం నుంచి వచ్చిన నువ్వు ఆ విలువలు కాపాడతావని నమ్మకం కలిగింది" చెప్పాడు కృష్ణ.

శోభ తన అదృష్టానికి మురిసిపోయింది. ఆమె కళ్లు చెమర్చాయి. కృష్ణ ఆప్యాయంగా ఆమెను కౌగిలించుకున్నాడు.

"శోభా! నీకు మరొక విషయం కూడా చెప్పాలి. నాతో పనిచేస్తున్న కొలీగ్స్ చాలామంది సంతోషంగా లేరు. చాలామంది ప్రేమపెళ్లిళ్లు పెటాకులవుతున్నాయి. ఉద్యోగాలు చేస్తున్న అమ్మాయిల్లో సూపర్ ఇగో పెరిగిపోతోంది. భర్తతో సర్దుకుపోవడం లేదు. హక్కుల గురించి మాట్లాడుతున్నారు కానీ కుటుంబ బాధ్యతలు ఆలోచించడం లేదు. మధ్యతరగతి ఏ విషయంలో అయినా సర్దుకుపోతుంటారు. వాళ్లకు కష్టసుఖాలు తెలుసు. డబ్బులో పుట్టిపెరిగిన వాళ్లకు కష్టసుఖాలు తెలియవు. కోరికలు పెంచుకుంటూ కష్టాలు కొని తెచ్చుకుంటున్నారు" అన్నాడు కృష్ణ.

"నేను చాలా అదృష్టవంతురాలినండీ మీ వంటి భర్త దొరకడం..." అంటూ కృష్ణ రెండు చేతులూ తీసుకుని కళ్లకు అద్దుకుంది శోభ.

"ఈ నీలి చందమామ జీవితాంతం తోడుగా వుండాలనే స్వార్థం నాది" అంటూ ఆమెను ప్రేమగా దగ్గరికి తీసుకున్నాడు కృష్ణ. ●